క్లుప్తంగా

కొండపాలెంలో వనరుల శిక్షణ కేంద్రం



శిక్షణ ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ మాస్టర్ ట్రైనర్ బత్తి దేవి

రోలుగుంట: మండలంలోని కొండపాలెం రైతు భరోసా కేంద్రంలో గ్రామస్థాయి వనరుల శిక్షణ కేంద్రాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ శాఖ మాస్టర్ ట్రైనీ బత్తి దేవి రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం సాగు వనరులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్థాయి వ్యవసాయాధికారి యశోద, మోడల్ మేకర్ రామకృష్ణ, సిబ్బంది జ్యోతి, నాయుడు, సాంబమూర్తి పాల్గొన్నారు.

లంపీస్కిన్ నివారణకు టీకా తప్పనిసరి



పశువులకు లంపీస్కిన్ వ్యాధి నిరోధక టీకాలను వేస్తున్న ఏడీ బైరాగి

కె.కోటపాడు: లంపీస్కిన్ వ్యాధి నివారణకు పశువులకు తప్పనిసరిగా వ్యాధినిరోధక టీకాలను వేయించాలని కె.కోటపాడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరక్టర్ జి.బైరాగి తెలిపారు. సింగన్నదొరపాలెం ఆర్బీకే పరిధిలో పశువులకు బుధవారం లంపీస్కిన్ వ్యాధినిరోధక టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లంపీస్కిన్ వ్యాధి బారిన పడిన పశువులకు శరీరమంతా దద్దుర్లు, అధిక ఉష్ణోగ్రతతో కూడిన జ్వరం వస్తుందని చెపారు. దీంతో పశువు నీరసించి పోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయకుడు ఎం.బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



ఖండిపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న స్వామినాయుడు

చోడవరం: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా అడిషనల్ డీపీఎం ఆర్.వి.స్వామినాయుడు తెలిపారు. మండలంలో ఖండిపల్లి వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. బీజామృతంతో నారును శుద్ధి చేయడంతోపాటు కొసలు తుంచి నాటడం వల్ల నారు ఎటువంటి వాతావరణాన్నైనా తట్టుకుంటుందని స్వామినాయుడు చెప్పారు. రైతులు నారుమడులు వేసే టప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డివిజన్ ఇన్‌చార్జి నాగమణి, మోడల్ మేకర్ శ్రీనివాసరావు, మండల ఇన్‌చార్జి సన్నిబాబు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రచారం

కె.కోటపాడు : బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రచారం చేస్తున్నట్టు సొసైటీ ఫర్ ఎడ్యుకేషన్ ఎన్విరాన్మెంట్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ సంతోష్ తెలిపారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ముద్రించిన వాల్‌పోస్టర్లను బుధవారం చౌడువాడగ్రామ సచివాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్థిక స్థోమత లేక కార్మికులుగా మారుతున్న పిల్లల చదువులకు తమ సంస్థ ద్వారా సహకారాన్ని అందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, పంచాయతీ కార్యదర్శి రాముగాయుడు, కుంచా అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

మొదలైన వరి నాట్లు

కోటవురట్ల : మండలంలో ఖరీఫ్ సందడి మొదలైంది. వాతావరణం అనుకూలంగా ఉండడంతో జోరుగా వ్యవసాయ పనులు నిర్వహిస్తున్నారు. ముందుగా నారు పోసిన ప్రాంతాలలో వరినాట్లు మొదలయ్యాయి. దాంతో తెల్లవారుజాము నుంచి పల్లెల్లో కూలీల సందడి కనిపిస్తోంది. ట్రాక్టర్లతో దమ్ము పడుతూ, నారు తీస్తూ హడావుడిగా ఉన్నారు. యండపల్లి, జల్లూరు, రాజుపేట, కోటవురట్ల, కైలాసపట్నంలోని పలు ప్రాంతాలలో వరినాట్లు వేస్తున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణతో పరిపూర్ణ ఆరోగ్యం

- పోషణ కిట్లు పంపిణీ చేసిన విప్ ధర్మశ్రీ



గర్భిణులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్



కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ గిరిబాబు

రావికమతం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంతో గర్భిణులు, బాలింతలకు మంచి పోషకాహారం అందింది, సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో బుధవారం ఆయన టేక్‌హోమ్ రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించి, కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కిట్లలో పోషక విలువలతో కూడిన ఆహారం ఉందని, మహిళల్లో రక్తహీనత లోపం తలెత్తకుండా గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త ఈ కిట్లను గర్భిణులు, బాలింతల ఇళ్లకు తీసుకు వెళ్లి అందజేయడంతో పాటు వారు విధిగా వినియోగించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు,మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, వైస్ ఎంపీపీ దంట్ల వెంకట రమణ,సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బంటు సన్యాసినాయుడు,ఎంపీటీసీ ఫ్లోర్ లీడర్ పూడి దేవ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గంటా ఈశ్వర రావు ఐసీడీఎస్ పీవో ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ

నర్సీపట్నం:గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరకులు నేరుగా ఇంటి వద్దే అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. నర్సీపట్నం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పెదబొడ్డేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెలా రెండుసార్లు వీరికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరకులను ఇంటికి పంపాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రాజెక్టు పరిధిలోని గర్భిణులు 700 మంది, బాలింతలు 650 మందికి పథకం ద్వారా ప్రయోజనం చేకూరుతుందన్నారు. అనంతరం సీడీపీవో కె.మేరి సువార్త మాట్లాడుతూ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా టేక్ హోం రేషన్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్టు చెప్పారు. 10 రకాల సరకులతో కూడిన బ్యాగ్‌ను లబ్ధిదారులకు ఇళ్ల అందజేస్తామన్నారు. అనంతరం గర్భిణులకు శ్రీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్లు రామకృష్ణ, అప్పలనాయుడు, వార్డు కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర, వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం నూరుశాతం సద్వినియోగం జరిగేలా అంగన్‌వాడీ కార్యకర్తలు పనిచేయాలని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు తెలిపారు. గొలుగొండ ప్రాజెక్టు పరిధిలో బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ పథకం అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరి, ఎంపీడీవో డేవిడ్‌రాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, సర్పంచ్ కసిపల్లి బుజ్జి, ఎంపీటీసీ సభ్యురాలు చేపల చిన పాప తదితరులు పాల్గొన్నారు.

చీడికాడలో

చీడికాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పోషకాహార కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సీహెచ్.శ్రీదేవి మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమన్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని చెప్పారు. పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లాలం శారద జానకీరామ్, ఎంపీడీవో జయప్రకాశ్, సూపర్ వైజర్లు, పి.చిన్నమ్మలు, జి.రమణి తదితరులు పాల్గొన్నారు.



కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ జయమ్మ, జెడ్పీటీసీ శారదాజానకీరామ్

నిర్దేశిత గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి



దేవరాపల్లిలో సీసీ రోడ్లు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదేశం

దేవరాపల్లి: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆదేశించారు. దేవరాపల్లిలో శారదానది నుంచి నాలుగు రోడ్లు కూడలి వరకు సుమారు రూ.50 లక్షల వ్యయంతో చేపడుతున్న రోడ్డు విస్తరణ, సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. నాణ్యతాప్రమాణాల విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ అభివృద్ధి పనులతో పాటు నూతన ఎంపీడీవో భవన నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు. డిప్యూటీ సీఎం జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వరదపురెడ్డి సింహాచలంనాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ, చల్లా నాయుడు, వాలేటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ ధ్యేయం

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



సంక్షేమ పథకాలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం:బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మున్సిపాలిటీ 26వ వార్డులో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు వార్డు ఇన్‌చార్జి చిటికెల కన్నబాబు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని సీఎం నెరవేర్చారని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా రాజకీయాలకతీతంగా ఇంటికే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు ఏకాశివ, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఉన్నీషా బేగం, కౌన్సిలర్ వీరమాచినేని జగదీశ్వరి, టౌన్ మహిళా అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా, లగుడు స్వామి, దుర్గామల్లేశ్వరి దేవి ఆలయ చైర్మన్ సీహెచ్.సతీష్ పార్టీ సీనియర్ నాయకులు గుడబండి నాగేశ్వరరావు, యాదగిరి శేషు, కణితి అన్నపూర్ణ, కొణతాల వరలక్ష్మి, గంటా లలిత, లాలం అప్పారావు, మామిడి శ్రీను, లోకవరపుశారద, శ్రీను పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనను ఖండిస్తూ నిరాహార దీక్ష



మాట్లాడుతున్న నాగరాజు

నర్సీపట్నం:మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న లైంగికదాడులు, హత్యలను ఖండిస్తూ ఆర్డీవో కార్యాలయం వద్ద అఖిలపక్షాలు బుధవారం నిరాహార దీక్ష చేపట్టాయి. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొట్టా నాగరాజు మాట్లాడుతూ మణిపూర్ ఘటనను అందరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని చెప్పారు. అక్కడ రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మీసాల సుబ్బన్న, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.రామునాయుడు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్లరాజు, ప్రజాబంధు పార్టీ నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి వంద రోజుల పాటు పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అరుణశ్రీ

మాకవరపాలెం: ఉపాధి హామీ పథకం కింద ప్రతి కుటుంబానికి వంద రోజుల పాటు పనులు కల్పించాలని ఎంపీడీవో అరుణశ్రీ ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న కూలీలు, వారికి ఇప్పటివరకు కల్పించిన పనిదినాల గురించి తెలుసుకున్నారు. ఉపాధి పథకంలో చేపట్టే నా భూమి-నాదేశం, నేల తల్లికి నమస్కారం -వీరులకు వందనం కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వరలక్ష్మి, హౌసింగ్ ఏఈ మధు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ కర్రి సత్యం



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ పావని

దేవరాపల్లి: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, రెండేళ్ల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే తాగించాలని దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా మామిడిపల్లిలో బుధవారం గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. తల్లిపాల వల్ల చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ వేచలం సెక్టార్ సూపర్‌వైజర్ జి.ఆదిలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి కె.సుధాకర్ బాబు, స్థానిక ఏఎన్ఎం కె.విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ పద్మ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో...

దేవరాపల్లి పీహెచ్‌సీలో బుధవారం జరిగిన తల్లిపాల వారోత్సవాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.లలిత తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలలో అధిక పోషక విలువలు

కె.కోటపాడు : పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలను అందించాలని గుల్లేపల్లి హెల్త్ వెల్‌నెస్ కేంద్రం ఎంఎల్‌హెచ్‌పీ పావని అన్నారు. గుల్లేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ తల్లిపాలలో అధిక ఔషధ గుణాలు, పోషక విలువలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, జయలక్ష్మి పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకారం



ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును మర్యాదపూర్వకంగా కలిసిన ప్రిన్సిపాల్ రాధ

దేవరాపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి సహకరిస్తానని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన బి.రాధ తారువలోని క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖపట్నంలోని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు.

శభాష్ వలంటీర్లు

జిల్లాలో సామాజిక పింఛన్ల పంపిణీ జోరుగా సాగుతోంది. వ్యాధులతో దూరప్రాంతాల్లో చికిత్సపొందుతున్న వారి వద్దకు సైతం వలంటీర్లు వెళ్లి పింఛన్ అందజేస్తూ తమ సేవాగుణాన్ని చాటుతున్నారు. ఇలా పింఛన్లు అందజేసిన వలంటీర్లను పలువురు ప్రశంసించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గంగన్నకు పింఛను అందజేస్తున్న వలంటీరు సాయికుమార్



కేజీహెచ్‌లో శ్రీనివాసరావుకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పార్వతీశం



వరహాలమ్మకు ఫించన్ అందజేస్తున్న వలంటీరు రమణ



రమణమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు లక్ష్మి

రావికమతం: మండలంలోని కవగుంట గ్రామ వలంటీర్ పరవాడ రమణ విశాఖ వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న చేపూరి వరహాలమ్మ,సమాల తరుణ్‌కుమార్‌లకు బుధవారం పింఛన్ అందజేశాడు. చినపాచిల గ్రామానికి చెందిన వలంటీర్ లక్ష్మి విశాఖ వెళ్లి అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కలిమి రమణమ్మకు పింఛన్ అందజేసింది. వీరిని పలువురు గ్రామస్తులు ప్రశంసించారు.

మాడుగుల: మండలంలో సాగరం పంచాయతీ సురవరం గ్రామానికి చెందిన బంగారు గంగన్న గత కొంత కాలంగా అనారోగ్యంతో విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో అదే గ్రామానికి చెందిన వలంటీర్ శ్రీనాధు సాయికుమార్ బుధవారం తన సొంత ఖర్చులతో విశాఖ వెళ్లి గంగన్నకు పింఛను అందజేశాడు. వలంటీరుకు గంగన్న కృతజ్ఞతలు తెలిపాడు.

కె.కోటపాడు : చౌడువాడ గ్రామ వలంటీర్ గంగులకుర్తి పార్వతీశం తన సొంత ఖర్చులతో బుధవారం కేజీహెచ్‌కు వెళ్లి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దాడి శ్రీనివాసరావుకు పింఛన్ అందజేశాడు. శ్రీనివాసరావు కిడ్నీ సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో ఆయనకు సంబంధించిన పింఛన్ నగదు రూ.10వేలను ఆస్పత్రికి వెళ్లి వలంటీర్ అందజేశాడు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి అప్పలరాజు తదితరులు వలంటీరు పార్వతీశం సేవలను ప్రశంసించారు.

చీడికాడ: మండలంలోని జైతవరానికి చెందిన కోడూరి లక్ష్మి అనే వృద్ధురాలికి ఇటీవల కాలువిరిగిపోయింది. దీంతో ఆమె విశాఖలో ఉంటూ చికిత్స పొందుతోంది. వలంటీరు కంటిపాము జ్యోతి విశాఖ వెళ్లి లక్ష్మికి బుధవారం పింఛన్ నగదు అందజేసింది.



వృద్ధురాలికి పింఛన్ నగదు అందజేస్తున్న వలంటీరు జ్యోతి

ఆరుగురు వలంటీర్ల నియామకం



వలంటీరుకు నియామక పత్రం అందజేస్తున్న ఎంపీడీవో అరుణశ్రీ

మాకవరపాలెం: మండలంలోని ఐదు పంచాయతీల్లో ఆరుగురు వలంటీర్లను బుధవారం నియమించినట్టు ఎంపీడీవో అరుణశ్రీ తెలిపారు. మండలంలోని వజ్రగడలో ఒకరు, బి.ఎస్.పేటలో ఒకరు , జి.గంగవరంలో ఒకరు, మాకవరపాలెంలో ఇద్దరు నారాయణరాజుపేటలో ఒకరు చొప్పున వలంటీర్లను నియమించినట్టు ఎంపీడీవో తెలిపారు. ఈ సందర్భంగా వారికి నియామక పత్రాలను అందజేశారు.

ధార్మిక కమిటీ బలపడాలి



సమరసతా సేవా ఫౌండేషన్ అచ్యుతాపురం మండల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : ప్రతి గ్రామంలో ధార్మిక కమిటీలు బలపడాలని సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి.రమణ అన్నారు. అచ్యుతాపురం నూకాంబిక అమ్మవారి ఆలయంలో బుధవారం సమరసతా సేవా ఫౌండేషన్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల్లో, రక్షా బంధన్ వేడుకల్లోనూ అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ నెల 19న సమరసతా సేవా ఫౌండేషన్ గ్రామ కన్వీనర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. కొల్లి అప్పారావు, రెడ్డి అప్పలనాయుడు, చోడపల్లి సత్యం పాల్గొన్నారు.

జగనన్న కాలనీలతో సొంతగూడు



రిబ్బన్ కట్ చేసిన ఇంటిని ప్రారంభిస్తున్న ఎంపీపీ సత్యనారాయణ

మాకవరపాలెం: జగనన్న కాలనీలతో పేదలకు సొంత ఇంటికల నెరవేరిందని ఎంపీపీ రుత్తల సత్యనారాయణ అన్నారు. మండలంలోని బూరుగుపాలెం జగనన్న కాలనీలో గ్రామానికి చెందిన పూడి సత్తిబాబు ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాడు. బుధవారం జరిగిన గృహప్రవేశం కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని హామీలను అమలు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధికార ప్రతినిధి భీమిరెడ్డి గోవింద పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మాకవరపాలెం: సీజనల్ వ్యాధులపై అంతా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి శ్రీవిద్య సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తామరం సచివాలయంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణం మారిన దృష్ట్యా అందరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.